క్లుప్తంగా

రక్తదానంతో ప్రాణదానం


విద్యార్థినికి ప్రశంసాపత్రం అందిస్తున్న అధికారులు

మురళీనగర్: రక్తదానం ద్వారా ప్రమాదంలో ఉన్నవారికి ప్రాణదానం చేసిన వారిమవుతామని కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.నారాయణరావు అన్నారు. నగరంలోని ఏఎస్ రాజా స్వచ్ఛంద రక్తనిధి బ్యాంకు ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో రక్తదాన శిబిరం మంగళవారం నిర్వహించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తోటివారికి సాయ పడాలంటే కేవలం డబ్బే అవసరం లేదని, అనేక మార్గాలున్నాయని, అందులో రక్తదానం ఒకటని చెప్పారు. ప్రతీ వ్యక్తి రక్తదానం చేయడానికి ముందుకు రావాలని సూచించారు. సామాజిక సేవా కార్యక్రమాల నిర్వహణ ద్వారా యువత ఆదర్శంగా నిలవాలన్నారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు రక్తదానం చేశారు. వారికి అతిథుల చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు అందించారు. కార్యక్రమంలో ఫార్మసీ విభాగాధిపతి గోవర్ధనరావు, ఇతర విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికులను తొలగిస్తే సమ్మె చేస్తాం


ధర్నాలో అఖిలపక్ష నాయకులు, కార్మికులు

సీతంపేట: విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్‌లో కాంట్రాక్టు కార్మికుల తొలగింపును వెంటనే ఆపాలని కోరుతూ అక్కయ్యపాలెం పోర్టు స్టేడియం ఎదురుగా ఉన్న రీజినల్ కమిషనర్ ఆఫ్ లేబర్ (సెంట్రల్) ఆఫీస్ వద్ద ప్లాంట్ అఖిలపక్ష కాంట్రాక్టు కార్మిక సంఘాల నాయకులు మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కేఎం శ్రీనివాస్, ఆర్కేఎస్‌వీ కుమార్ మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌లో అనేక సంవత్సరాల నుంచి 15 వేల మంది కాంట్రాక్టు కార్మికులు పని చేస్తున్నారని తెలిపారు. వీరిలో చాలా మంది స్టీల్‌ప్లాంట్ నిర్మాణం కోసం తమ భూములు త్యాగం చేసిన నిర్వాసితులు ఉన్నారన్నారు. ఉత్పత్తిలో కీలక పాత్ర పోషిస్తున్న వీరిని తొలగించడం అన్యాయమన్నారు. స్టీల్‌ప్లాంట్‌ను పరిరక్షిస్తామని, దానికి అవసరమైన పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని కేంద్రంలోని మోదీ ప్రభుత్వం, రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం, యాజమాన్యం చెబుతూ ప్లాంటును ప్రైవేటీకరించేందుకు అనేక కుట్రలు పన్నుతున్నారని మండిపడ్డారు. ఇప్పటికే కాంట్రాక్టు కార్మికులను 900 మందిని తొలగించారని, భవిష్యత్‌లో ప్రతి మూడు నెలలకు 1400 మంది చొప్పున 5600 మందిని తొలగించేందుకు కేంద్ర ప్రభుత్వం, యాజమాన్యం కుట్ర పన్నాయని ఆరోపించారు. తక్షణమే కాంట్రాక్టు కార్మికుల తొలగింపును నిలిపివేసి, ఈఎస్ఐ, వైద్య సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. లేకుంటే పెద్ద ఎత్తున సమ్మె చేసేందుకు కార్మికవర్గం సిద్ధంగా ఉందని హెచ్చరించారు. కార్యక్రమంలో జి.శ్రీనివాస్, నమ్మి రమణ, మంత్రి రవి, కె.వంశీ, ఉమ్మడి అప్పారావు, పి.భాస్కరరావు, రామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

చీటింగ్ కేసు నమోదు

సీతమ్మధార: సంస్థను మోసగించిన వ్యక్తిపై ఫోర్తుటౌన్ పోలీసులు చీటింగ్ కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ... అక్కయ్యపాలెంలో శ్రీనిధి అసోసియేట్ కార్యాలయంలో సత్యధనరాజ్ అనే వ్యక్తి సహాయ మేనేజర్‌గా పనిచేసేవాడు. వినియోగదారుల నుంచి బ్యాంకు రుణాలు వసూలు చేసిన ధనరాజ్ ఆ నగదు సంస్థకు చెల్లించకుండా మోసం చేశాడు. రూ.2.34 లక్షల వరకూ దోచుకోవడంతో ఇటీవల విధుల నుంచి తొలిగించారు. అతను చేసిన మోసంపై సంస్థ ప్రతినిధి రాంకుమార్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బ్యాంక్ ఉద్యోగుల డిమాండ్లు పరిష్కరించాలి

సీతమ్మధార : యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్ పిలుపు మేరకు బ్యాంకు ఉద్యోగుల డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ మార్చి 24, 25న దేశవ్యాప్తంగా సమ్మె చేపడతామని యూనియన్ నాయకులు పేర్కొన్నారు. ద్వారకానగర్‌లో గల సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజినల్ ఆఫీస్ వద్ద మంగళవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా యు.ఎఫ్.బి.యు. కన్వీనర్ ఆర్.వసంత రావు మాట్లడుతూ అన్ని బ్యాంక్‌లలో ఖాళీలు భర్తీ చేయాలని, వారానికి ఐదు రోజుల పనిదినాలు అమలు పరచాలని, ప్రభుత్వరంగ బ్యాంకుల్లో వర్క్ మెన్, ఆఫీసర్స్ డైరెక్టర్ల పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘ నాయకులు కమలాకర్, రమేష్, ఈశ్వర్, రామ రెడ్డి, స్వాతి సుజాత పాల్గొన్నారు.


బాలయ్యశాస్త్రి లే అవుట్ రోడ్డు పక్కనే పేరుకుపోయిన మట్టి, వ్యర్థాలు


రాధాకృష్ణ లే అవుట్ రోడ్డుపై పేరుకుపోయిన మట్టి కుప్పలు

ఎక్కడి మట్టికుప్పలు అక్కడే

- రాకపోకలకు స్థానికులకు తీవ్ర ఇబ్బందులు
- అమృత్ స్కీమ్ కింద పైప్‌లైన్ల ఏర్పాటు
- మట్టి తవ్వి వదిలేస్తున్న కార్మికులు
- పట్టించుకోని జోన్ - 3 ఇంజినీర్లు

సీతమ్మధార: ఎవరెన్ని చెప్పినా సరే మా తీరు ఇంతే అన్నట్లుగా ప్రవర్తించే వారెవరంటే తక్కువమని జీవీఎంసీ నీటి సరఫరా విభాగం కార్మికులు, అధికారులే అని చెప్పడం అతిశయోక్తి కాదు. జీవీఎంసీ జోన్ - 3 నీటి సరఫరా విభాగం సిబ్బంది ఎక్కడ ఉన్నారో గానీ నియోజకవర్గంలోని మట్టి కుప్పలకు మాత్రం మోక్షం కలగడం లేదు. ఏ వీధిలోనూ పైప్‌లైన్ల కోసం తవ్విన గోతులను సక్రమంగా పూడ్చడం లేదని సర్వత్రా **ఆందోళన వ్యక్తమవుతోంది. పైగా ఆ మట్టి కుప్పలు రోడ్ల** మీదనే వదిలేసినా తరలించే నాథుడు కరువయ్యాడని స్థానికుల వాపోతున్నారు. ఒకవైపు స్వచ్ఛభారత్ అంటూ ఎంతో ఆర్భాటంగా ప్రకటనలు గుప్పించే జీవీఎంసీ అధికారులు ఆచరణలో మాత్రం విఫలమవుతున్నారని సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నియోజకవర్గంలోని **జీవీఎంసీ 14వ వార్డు బాలయ్యశాస్త్రి లే అవుట్, పీ అండ్ టీ కాలనీ, టీపీటీ కాలనీ, గురుద్వారా** తదితర ప్రాంతాలు కంపుకొడుతున్నా అధికారులకు మాత్రం చీమకుట్టినట్టయినా లేకపోవడం గమనార్హం. ఇక్కడి ప్రెసిడెన్సియల్ స్కూల్‌ను ఆనుకుని ఉన్న రోడ్డంతా మట్టికుప్పలతో పేరుకుపోవడంతో పిల్లల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. మరోవైపు శీతాకాలం నుంచి వేసవిలోకి ప్రవేశించిన తరుణంలో సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. దీనికితోడు రోడ్లు, కాలువలు, గెడ్డలు చెత్తమయంగా మారడంతో ఆయా వార్డుల్లో సీజనల్ వ్యాధులు ప్రబలుతాయని సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. సచివాలయం ఎమినిటీస్ సెక్రటరీలు ఏం చేస్తున్నారో తెలియడం లేదని, మట్టికుప్పల తరలింపునకు **మాత్రం మోక్షం కలగడం లేదని ప్రజలు నిట్టూరుస్తున్నారు. రోడ్లపై ఎక్కడ చూసినా మట్టికుప్పలే** దర్శనమిస్తున్నాయి. ఫలితంగా రాకపోకలకు పాదచారులు, వాహనచోదకులు ఇబ్బంది పడుతున్నారు. పలు ప్రాంతాల్లో ఇంకా మట్టి కుప్పలు తరలించడం లేదని ప్రజల నుంచి ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నా జీవీఎంసీ జోన్ - 3 నీటి సరఫరా విభాగం అధికారులకు మాత్రం వినిపించడం లేదని స్థానికులు అంటున్నారు. పైప్‌లైన్ గోతులు పూడ్చినా రోడ్ల పరిస్థితి ఘోరంగా ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జీవీఎంసీ జోన్ - 3 నీటి సరఫరా విభాగం అధికారులు స్పందించి నియోజకవర్గంలో పేరుకుపోయిన మట్టికుప్పలను తరలించాలని ప్రజలు కోరుతున్నారు.

అధ్వానంగా రోడ్లు

బాలయ్యశాస్త్రి లే అవుట్ ప్రాంతంలో అమృత్ స్కీమ్ కింద పైప్‌లైన్‌లు ఏర్పాటు చేశారు. కానీ, పూడ్చిన గోతుల వద్దనే మట్టి కుప్పలు ఇష్టానుసారంగా వదిలేశారు. వారాలు గడుస్తున్నా సరే మట్టికుప్పలు తరలించడం లేదు. ఫలితంగా వాహనచోదకుల రాకపోకలకు ఇబ్బందిగా ఉంది.

– భాను బాలయ్యశాస్త్రి లే అవుట్

రోడ్లన్నీ మట్టిమయం

అమృత్ స్కీమ్ కింద పలు ప్రాంతాల్లో పైప్ లైన్లు ఏర్పాటు చేస్తున్నారు. ఇందుకోసం తవ్విన రోడ్లు సక్రమంగా పూడ్చడం లేదు. ఫలితంగా రోడ్ల మీదనే మట్టి కుప్పలు దర్శనమిస్తున్నారు. వెంటనే జోన్ - 3 నీటి సరఫరా విభాగం ఇంజినీర్లు స్పందించి మట్టికుప్పలు తరలించాలి.

– దేవి, సీతమ్మధార నార్త్ ఎక్స్‌టెన్షన్


ప్రెసిడెన్సియల్ స్కూలు రోడ్డులో పేరుకుపోయిన మట్టి కుప్పలు

హాల్ టికెట్ల జారీ


పదో తరగతి హాల్ టికెట్లు అందుకున్న విద్యార్థులతో హెచ్ఎం, ఉపాధ్యాయులు

సీతమ్మధార: స్థానిక పీ అండ్ టీ కాలనీలో గల నెహ్రూ మున్సిపల్ హైస్కూల్ విద్యార్థులకు మంగళవారం పదో తరగతి హాల్ టికెట్లు జారీ చేశారు. ఇక్కడ చదువుతున్న 168 మంది విద్యార్థులకు సిబ్బంది హాల్ టికెట్లు అందించారు. ఈ హైస్కూల్‌లో బాలికలు 107, బాలురు 61 మంది చదువుకుంటున్నారు. మార్చి 17న పరీక్షలు ప్రారంభంకానున్నాయి. ఈ సందర్భంగా హెచ్ఎం రామ్‌ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులంతా కష్టపడి చదివి మంచి మార్కులతో ఉత్తీర్ణులవ్వాలని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు నాగభూషణం, కళ్యాణి, సిబ్బంది పాల్గొన్నారు.

నందీశ్వరుడికి ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో నందీశ్వరుడు

సీతమ్మధార: జీవీఎంసీ 14వ వార్డులో నందీశ్వరుడికి భక్తిశ్రద్ధలతో భక్తులు పూజలు చేశారు. సీతమ్మధార నార్త్ ఎక్స్‌టెన్షన్‌లోని శ్రీమహా గణపతి, ప్రసన్న వేంకటేశ్వర స్వామి, అయ్యప్ప, శ్రీషిర్డీ సాయిబాబా ఆలయంలో మంగళవారం సాయంత్రం నందీశ్వరుడికి పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు రాజాస్వామి ఆధ్వర్యంలో ముందుగా పంచామృతాభిషేకం చేసి ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు.

- జీవీఎంసీ 24వ వార్డు నక్కవానిపాలెంలోని శ్రీ ఉమానీలంకేశ్వర స్వామి ఆలయంలో త్రయోదశి సందర్భంగా సాయంత్రం 6 గంటలకు నందీశ్వరుడికి ప్రత్యేక పూజలు చేశారు. అర్చకుడు మహేష్ ఆధ్వర్యంలో పంచామృతాభిషేకాలు చేశారు. దోశ నివారణకు త్రయోదశి సందర్భంగా నందీశ్వరుడికి పూజలు చేస్తే మంచి జరుగుతుందని అర్చకులు తెలిపారు.

ఘనంగా ముత్యాలమ్మ అనుపోత్సవం


గటాలతో అమ్మవారి అనుపోత్సవంలో భక్తులు

సీతమ్మధార: జీవీఎంసీ 24వ వార్డులోని నక్కవానిపాలెంలో గల గ్రామ దేవత శ్రీ ముత్యాలమ్మ పండగ మహోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం అనుపోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముత్యాలమ్మ తల్లి ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారి ఉత్సవాల సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. 24వ వార్డు కార్పొరేటర్ సాడి పద్మారెడ్డి దంపతులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. గిడ్డంగులు సంస్థ మాజీ చైర్మన్ సత్తి రామకృష్ణారెడ్డి, టీడీపీ ఉత్తర నియోజకవర్గ ఇన్‌చార్జి వెల్లంకి భరత్ తదితరులు పాల్గొన్నారు. క్రాంతినగర్ గ్రామ కమిటీ ఆధ్వర్యంలో సారె తీసుకొచ్చి అమ్మవారికి సమర్పించారు. గ్రామంలో డ్యాన్స్ బేబీ డ్యాన్స్, గరిడీలు, పులివేషాలు, పంజాబ్ డ్యాన్స్, తదితర కార్యక్రమంలు నిర్వహించారు. అమ్మవారిని నక్కవానిపాలెం, గాంధీనగర్, రేసపువానిపాలెం, క్రాంతినగర్, మద్దిలపాలెం, అక్కయ్యపాలెం, సీతమ్మధార, హెచ్‌బీకాలనీ, పలు ప్రాంతాల భక్తులు దర్శించుకున్నారు. ఈ నెల 18న మారు వారం ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తామని కమిటీ అధ్యక్షుడు గుడ్ల కాటరాజు రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ఉపాధ్యక్షుడు బోర రవికుమార్ రెడ్డి, కార్యదర్శి కారపురెడ్డి శ్యామ్‌రెడ్డి, నందిక వేణురెడ్డి, కోశాధికారి ధర్మాల గురుమూర్తి రెడ్డి, డీవీఎస్ రెడ్డి, గుప్తాజీ పాల్గొన్నారు. అమ్మవారి ఉత్సవాల కారణంగా నక్కవానిపాలెం పరిసర ప్రాంతాల్లో సందడి నెలకొంది.


మజ్జిగ పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ పద్మారెడ్డి

వసూల్ రాజాలు

- వ్యాపారులు, పారిశుధ్య కార్మికుల నుంచి యథేచ్ఛగా ముడుపులు
- శానిటరీ ఇన్‌స్పెక్టర్లపై ఆరోపణలు
- చర్యలు తీసుకోని జీవీఎంసీ ఉన్నతాధికారులు



సీతమ్మధార: జీవీఎంసీ పరిధిలో గల శానిటరీ ఇన్‌స్పెక్టర్లకు జీతాలకంటే ముడుపులే ఎక్కువ అంటే అతిశయోక్తి కాదు. ఏదో ఒక రూపంలో చేతిలో సొమ్ము పడకపోతే వారు ఇంటికెళ్లరని నగరవాసులు అంటున్నారు. దుకాణాల నుంచి ఏళ్ల తరబడి వసూళ్లకు పాల్పడుతున్న వీరు పారిశుధ్య కార్మికులనూ వదలకుండా యథేచ్ఛగా ముడుపులు తీసుకుంటున్నా పట్టించుకునే నాథుడు కరువయ్యాడని సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. జీవీఎంసీ జోన్ - 3 పరిధిలో 14 నుంచి 27 వార్డులు ఉన్నాయి. జోన్ పరిధిలో 14 మంది శానిటరీ ఇన్‌స్పెక్టర్లు ఉన్నారు. పర్మినెంట్, అవుట్ సోర్సింగ్ కార్మికులు, ఎంటీసీ, మేస్త్రీలు, కార్మికులు కలిపి 964 మంది విధులు నిర్వర్తిస్తున్నారు. జోన్ - 3 పరిధిలో ఉన్న దుకాణాలకు, ట్రేడ్ లైసెన్సులకు ఎప్పుడూ పొంతన కుదరదు. సాధారణంగా ఏదైనా వ్యాపారం చేయాలంటే ముందుగా జీవీఎంసీ నుంచి ట్రేడ్ లైసెన్సు తీసుకోవాల్సి ఉంటుంది. వ్యాపారం స్థాయి ఆధారంగా నిర్ణీత మొత్తంలో లైసెన్సు ఫీజు చెల్లించాల్సి ఉంటుది. పైగా ఏటా ఆ లైసెన్సుని రెన్యువల్ చేసుకోవాలి. ఏ వార్డులో ఏ వ్యాపారికి లైసెన్సు లేదన్నది శానిటరీ ఇన్‌స్పెక్టర్‌కి ఇట్టే తెలిసిపోతుంది. దీంతో సదరు వ్యాపారుల నుంచి శానిటరీ ఇన్‌స్పెక్టర్లు యథేచ్ఛగా ముడుపులు తీసుకుంటున్నారని సర్వత్రా ఆరోపణలు వినిపిస్తున్నాయి.

కఠిన చర్యలు తీసుకుంటాం

శానిటరీ ఇన్‌స్పెక్టర్ల మీద ఫిర్యాదులు వస్తే విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటాం. పారిశుధ్య కార్మికులు సెలవు పెట్టినా శానిటరీ ఇన్‌స్పెక్టర్లకు డబ్బులు ఇవ్వాల్సిన పని లేదు. శానిటరీ ఇన్‌స్పెక్టర్లు డబ్బులు అడిగితే తనకు నేరుగా ఫిర్యాదు చేస్తే సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటాను.

–బి.ప్రసాదరావు, సహాయ వైద్యాధికారి, జోన్ - 3, ఆశీలమెట్ట

సెలవు పెట్టాలంటే సొమ్ములివ్వాల్సిందే

శానిటరీ ఇన్‌స్పెక్టర్లు మరో అడుగు దిగజారి పారిశుధ్య కార్మికులనూ దోచుకుంటున్నారనే ఆరోపణలు ఇటీవల బలంగా వినిపిస్తున్నాయి. కార్మికులు ఏదైనా పని మీద సెలవు పెట్టాలంటే శానిటరీ ఇన్‌స్పెక్టర్‌కి ముడుపులు చెల్లించుకోవాల్సిందే అన్నది బహిరంగ రహస్యమే. సెలవు పెట్టాలంటే డబ్బులెందుకు ఇవ్వాలని అనుకుంటున్నారామో... సాధారణంగా పారిశుధ్య కార్మికులు సెలవు పెడితే వేతనం కట్ అవ్వుతుంది. దీంతో వారికి వేతనం కట్ అవ్వకుండా ఉండాలంటే శానిటరీ ఇన్‌స్పెక్టర్ హాజరు పట్టికలో అక్రమాలకు పాల్పడాల్సి ఉంటుంది. కార్మికుడు విధులు నిర్వహించకపోయినా... హాజరుపట్టికలో మాత్రం విధులకు హాజరైనట్లే ఉంటుంది. ఇందుకుగాను శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పారిశుధ్య కార్మికుల నుంచి దర్జాగా ముడుపులు వసూలు చేస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. ఉన్నతాధికారులకు తెలిసినప్పటికీ చూసీ చూడనట్టు వదిలేస్తున్నారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. క్షేత్రస్థాయిలో ప్రజారోగ్యశాఖ అధికారులు తనిఖీ చేసినపుడు కూడా హాజరు పట్టికలో అక్రమాలు పసిగట్టలేకపోతున్నారంటే శానిటరీ ఇన్‌స్పెక్టర్లు ఎంత చాకచక్యంగా అక్రమాలకు పాల్పడుతున్నారో అర్థం చేసుకోవచ్చు. ఇప్పటికైనా జీవీఎంసీ ఉన్నతాధికారులు స్పందించి వసూల్ రాజాలపై దృష్టి సారించి చర్యలు చేపట్టాలని నగరవాసులు కోరుతున్నారు.

పోర్టు హాస్పిటల్‌ను కాపాడుకుంటాం

తాటిచెట్లపాలెం: విశాఖ ప్రజల మద్దతుతో పోర్టు హాస్పిటల్‌ను కాపాడుకుంటామని సీఐటీయూ విశాఖ జిల్లా కార్యదర్శి బి.జగన్ తెలిపారు. ఆస్పత్రి ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మంగళవారం నాటికి 162వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు మాట్లాడుతూ విశాఖ అభివృద్ధికి పోర్టు కారణమని, పోర్టు వద్ద ఉన్న వేల కోట్ల రూపాయలతో ఆస్పత్రిని అభివృద్ధి చేయాలని డిమాండ్‌చేశారు. ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని కోరారు. కార్యక్రమంలో జె.సత్యనారాయణ, సీహెచ్ నాయుడు, ఎల్లారావు, రాజగోపాల్, గణేష్, శ్రీనివాస్, పైడిరాజు, శంకర్రావు, నూకరాజు, రాఘవులు పాల్గొన్నారు.

రేషన్ సరకుల పంపిణీలో అలసత్వం వద్దు

- ఆహార పదార్థాలు పరిశుభ్రంగా, నాణ్యంగా అందించాలి
- రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యురాలు గంజిమాల దేవి


సిబ్బందితో మాట్లాడుతున్న గంజిమాల దేవి

మర్రిపాలెం/కంచరపాలెం: రేషన్ సరకుల పంపిణీలో జాప్యం లేకుండా, లబ్ధిదారులకు సకాలంలో అందజేయాలని రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యురాలు గంజిమాల దేవి సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం ఉదయం ఆమె నగరంలోని పలు రేషన్ డిపోలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రాథమిక పాఠశాలలు, మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును పరిశీలించి, తగిన సూచనలు చేశారు. పంపిణీ ప్రక్రియలో పొరపాట్లు తలెత్తితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి కళ్యాణి, ఇతర అధికారులతో కలిసి ఆశీల్‌మెట్ట సర్కిల్ - 2లోని రేషన్ డిపోను పరిశీలించారు. కార్డుదారుల వివరాలు అడిగి తెలుసుకుని, సరకుల పంపిణీలో పారదర్శకత పాటించాలని సూచించారు. అనంతరం కప్పరాడలోని అక్షయపాత్ర ఫౌండేషన్, యూపీహెచ్‌సీ కేంద్రాలను సందర్శించి, భోజన నాణ్యతపై ఆరా తీశారు. జీవీఎంసీ హైస్కూల్‌లో మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించి, పిల్లలకు స్వయంగా రాగి జావ అందజేశారు. విద్యార్థులతో ముచ్చటించి, ప్రభుత్వ పథకాల ప్రయోజనాలను వివరించారు. అనంతరం 54వ వార్డు నలందనగర్ అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లలకు అందిస్తున్న పోషకాహారం, టేక్ - హోమ్ రేషన్, రిజిస్టర్లు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఆర్ అండ్ బీ జంక్షన్ వద్ద ఉన్న పౌర సరఫరా శాఖ గొడౌన్‌ను సందర్శించి అక్కడ ఉన్న హమాలీలతో కొంతసేపు మాట్లాడారు. తర్వాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ గురుకులం (మేఘాద్రి గడ్డ) సందర్శించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. పర్యటనలో ఆమెతో పాటు అర్బన్ సీడీపీవోలు రమణకుమారి, శ్రీలత, సెక్టార్ సూపర్‌వైజర్ జ్యోతి, గోపాలపట్నం మండల విద్యాశాఖాధికారి దివాకర్, అక్షయపాత్ర ఫౌండేషన్ మేనేజర్ జానకీరామ్, క్వాలిటీ మేనేజర్ విజయకుమార్, రామ్ మోహన్, ఇతర విభాగాల అధికారులు పాల్గొన్నారు.

తపాలా కార్యాలయం పునరుద్ధరణ నేడు

మురళీనగర్: మురళీనగర్‌లో తపాలా కార్యాలయం పునరుద్ధరణకు అధికారులు చర్యలు తీసుకున్నారు. ఇక్కడి సెక్టార్ - 13లో మురళీనగర్, మాధవధార పరిసర ప్రాంతాలకు సేవలు అందించిన తపాలా కార్యాలయాన్ని అద్దె ఎక్కువగా ఉండడంతో ఇండస్ట్రియల్ ఎస్టేట్‌కు తరలించారు. దీంతో స్థానికులు సేవింగ్, ఆర్డీ సేవలు వినియోగించుకోవడానికి జాతీయ రహదారి దాటుకుని వెళ్లాల్సి రావడంతో ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ సమస్యపై మురళీనగర్ రెసిడెన్సియల్ అసోసియన్ అధ్యక్షుడు ససపల వరప్రసాద్‌తో కూడిన సభ్యుల బృందం తపాలా శాఖ అధికారులు, స్థానిక ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు దృష్టికి తీసుకెళ్లారు. తపాలా కార్యాలయం ఏర్పాటుకు మాధవధార మాధవ యువజన సమాజం భవనం ఇవ్వడానికి ఒప్పుకోవడంతో బుధవారం ప్రారంభించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు.

కనీస వేతనం రూ.35 వేలు ఇవ్వాల్సిందే

సీపీఐ నేత జేవీఎస్ఎన్ మూర్తి డిమాండ్


జీవీఎంసీ గాంధీ పార్కులో ధర్నా చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

సీతమ్మధార: అసంఘటితరంగ కార్మికులకు కనీస వేతనం రూ.35 వేలు చెల్లించాలని ఏఐటీయూసీ విశాఖపట్నం హార్బర్ పోర్టు వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు, సీపీఐ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి జె.వి.సత్యనారాయమూర్తి డిమాండ్ చేశారు. మంగళవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ఏఐటీయూసీ జిల్లా సమితి ఏర్పాటు చేసిన మహా ధర్నాను సత్యనారాయణమూర్తి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కార్మిక చట్టాలను కట్టిదిట్టంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం దేశంలోని 50 కోట్ల మంది అసంఘటితరంగ కార్మికులకు సామాజిక భద్రతతో కూడిన చట్టం రూపొందించాలని కోరారు. అనేక పోరాటాలతో సాధించుకున్న కార్మిక చట్టాలు రద్దు చేసి యజమానులకు అనుకూలంగా నాలుగు లేబర్ కోడ్లను తీసుకొచ్చారన్నారు. వాటి వల్ల కార్మికులు సమ్మె చేసే హక్కును కూడా కోల్పోయే ప్రమాదం ఏర్పడుతుందన్నారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు ఎం.మన్మథరావు, ప్రధాన కార్యదర్శి జి.ఎస్.జె.అచ్యుతరావు, గౌరవ అధ్యక్షుడు బి.సి.హెచ్.మసీన్, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు పాల్గొన్నారు.

గంజాయి తరలిస్తున్న యువకుడి అరెస్ట్

సీతమ్మధార: ఫోర్తుటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి అక్రమంగా తరలిస్తున్న యువకుడిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... హైదరాబాద్‌కు చెందిన నిఖిల్ (22) డుంబ్రిగూడలో 1.20 కిలోల గంజాయి కొనుగోలు చేసి హైదరాబాద్‌కు తీసుకెళ్లేందుకు సిద్ధమయ్యాడు. ఈ క్రమంలో డీఎల్‌బీ ప్రాంతంలో టాస్క్‌ఫోర్సు పోలీసులు దాడులు జరిపి నిఖిల్‌ను అదుపులోకి తీసుకుని గంజాయి స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని ఫోర్తుటౌన్ పోలీసులకు అప్పగించారు. సీఐ సత్యనారాయణ పర్యవేక్షణలో కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రెండు లీటర్ల గంజాయి లిక్విడ్ స్వాధీనం

గంజాయి లిక్విడ్‌ని విశాఖ తరలిస్తున్న ఇద్దరని టాస్క్‌ఫోర్సు పోలీసులు పట్టుకున్నారు. చింతపల్లి నుంచి ఇద్దరు యువకులు కృష్ణకాంత్ (25), తిమోతి (22) గంజాయి లిక్విడ్ విశాఖ తరలిస్తున్నట్లు ముందుగా అందిన సమాచారంతో టాస్క్‌ఫోర్సు ఎస్ఐ భరత్ సిబ్బందితో రైల్వేస్టేషన్ వద్ద నిఘా పెట్టి ఇద్దరినీ అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రెండు లీటర్ల గంజాయి లిక్విడ్ స్వాధీనం చేసుకుని, నిందితులను ఫోర్తుటౌన్ పోలీసులకు అప్పగించారు.